# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా కొద్ది సేపటి క్రితం క్రొయేషియా చేరుకున్నారు.
- ఫాస్ట్‌ట్యాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను వచ్చే ఆగస్టు 15 నుండి ప్రవేశపెట్టనున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.
- పాకిస్తాన్‌తో సమస్యల పరిష్కారానికి భారత్ మూడవ దేశ మధ్యవర్తిత్వాన్ని ఎన్నడూ అంగీకరించలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ఏకీకృత పెన్షన్ విధానంతో ఉద్యోగులకు సామాజిక భద్రత లభిస్తుందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

==========================

క్రొయేషియా పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆ దేశ రాజధాని జాగ్రెబ్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత్, క్రొయేషియా దేశాల మధ్య ప్రతినిధి స్థాయి చర్చలు, పలు కీలక రంగాలలో ఒప్పందాలు జరగనున్నాయి. ప్రధానమంత్రి పర్యటన ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో నూతన అధ్యాయాన్ని సూచిస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటన సందర్భంగా, భారత్, క్రొయేషియా దేశాలు సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, సాంస్కృతిక రంగాలలో ప్రధాన ఒప్పందాలపై సంతకాలు చేయనున్నాయి. ఉగ్రవాదంపై భారతదేశ వైఖరికి, అలాగే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత స్థానం కోసం చేసే ప్రయత్నాలకు క్రొయేషియా నుండి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

==========================

ఫాస్ట్‌ట్యాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను వచ్చే ఆగస్టు 15వ తేదీ నుండి ప్రవేశపెట్టనున్నామని కేంద్ర రోడ్డు, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై సజావుగాను, సరైన ఖర్చుతో

కూడుకున్న ప్రయాణానికి ఇది వీలు కల్పిస్తుందని ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ వార్షిక పాస్.. తీసుకున్న నాటి నుండి ఒక సంవత్సరం వరకు, లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుంది. 60 కిలోమీటర్ల పరిధిలో ఉన్న టోల్ ప్లాజాల గురించి చాలా కాలంగా ఉన్న ఆందోళనలకు ఇది ఒక చక్కని పరిష్కారమని ఆయన వివరిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

===========================

పాకిస్తాన్‌తో సమస్యలను పరిష్కరించడానికి భారతదేశం ఎప్పుడూ మూడవ పక్షం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కు స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించిన ఆయన.. పాకిస్తాన్ అభ్యర్థన మేరకు ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేయడానికి సంబంధించి ఆ దేశంతో నేరుగా చర్చలు జరిగాయని స్పష్టం చేశారు. కాగా.. పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్ - అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్ - పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయని, పాకిస్తాన్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశామని చెప్పారు. భారత్.. ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి ప్రధానమంత్రి స్పష్టంగా చెప్పారని.. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉందని విక్రమ్ మిస్రీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

===========================

బాలసాహిత్య, యువ సాహిత్య పురస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ ఈరోజు ప్రకటించింది. మొత్తం 24 భాషల్లో ఉత్తమ రచనలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన ఈరోజు సమావేశమైన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు పురస్కార విజేతల పుస్తకాల పేర్లను ప్రకటించింది. తెలుగు భాషకు సంబంధించి గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' పుస్తకం కేంద్ర బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక కాగా.. ప్రసాద్ సూరి విరచిత మైరావణ నవలకు.. యువ సాహిత్య పురస్కారం లభించింది. పురస్కార విజేతలకు త్వరలో ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో అవార్డుల ప్రదానం జరుగుతుంది. ఈ పురస్కారం కింద గ్రహీతలకు జ్ఞాపికను, 50 వేల రూపాయల నగదు ను అందజేస్తారు.

విరామం

===========================

గత సంవత్సరాల్లో ప్రభుత్వ సంస్థలలోని ఖాళీలను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఎన్డియే ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో జరిగిన పరిపాలనా సంస్కరణలు పాలనకే పరిమితం కాకుండా విస్తృతమైన ప్రభావాలను చూపించాయని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఏకీకృత పెన్షన్ పథకం కింద ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు పదవీ విరమణ, ఇంకా మరణ గ్రాట్యుటీ ప్రయోజనాలకు అర్హులు అవుతారని తెలియజేశారు. జాతీయ పెన్షన్ వ్యవస్థ కింద అన్ని వర్గాల ఉద్యోగులకు సామాజిక భద్రతను నిర్ధారించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఈ నూతన నిబంధన ప్రతిబింబిస్తుందని కేంద్ర సహాయ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

భారత వ్యోమగామి శుభాన్షు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపాల్సిన ఆక్సియం - 4 మిషన్‌ను ఈ నెల 22వ తేదీన చేపట్టనున్నామని ఆక్సియం స్పేస్ సంస్థ తెలిపింది. స్పేస్ X ఫాల్కన్ 9 లాంచ్ వెహికల్, డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ సంసిద్ధత, ISS మాడ్యూల్ మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్యం ఆధారంగా ఆక్సియం స్పేస్ తదుపరి సాధ్యమైన ప్రయోగ తేదీని నిర్ధారించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తెలిపింది. కీలక అంశాలను అంచనా వేసిన తర్వాత ప్రయోగ తేదీని సూచించామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

==========================

ఇటీవల నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ లో దేశవ్యాప్తంగా లక్షా 43 వేల గ్రామాలలో 13.4 కోట్ల మందికి పైగా రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమం వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ, అభివృద్ధి మూడు అంశాల అపూర్వ కలయికగా నిలిచిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన దార్శనికతకు ఈ కార్యక్రమం ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. గిరిజన జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి, వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ప్రచారం కింద 60 వేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించామని ఆయన వివరించారు. వ్యవసాయ క్షేత్రాలకు, ప్రయోగశాలలకు మధ్య అంతరాన్ని తగ్గించడం ఈ ప్రచారం ప్రాథమిక లక్ష్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ…

(వాయిస్ 35 సెకన్లు)

==========================

యోగాను ప్రపంచ వ్యాప్తం చేయడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ పేర్కొన్నారు. 2014లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసినప్పటి నుండి భారతదేశం యోగా సంస్థాగతీకరణలో గణనీయమైన పురోగతి సాధించిందని, గత 11 సంవత్సరాలలో అనేక విజయాలు అందుకుందన్నారు. పని ఒత్తిడిని ఎదుర్కోవడానికి రూపొందించిన 5 నిమిషాల గైడెడ్ యోగా మాడ్యూల్.. వై-బ్రేక్ ఎట్ వర్క్‌ప్లేస్ వంటి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు.

==========================
==========================